
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 29 ఏప్రిల్ 2025

నేటి నుంచి ఎప్‌సెట్

- ఖమ్మం జిల్లాలో 9 కేంద్రాలు.. 15,192 మంది విద్యార్థులు
- భద్రాద్రి జిల్లాలో 2 కేంద్రాలు... 1888 మంది విద్యార్థులు
- నేడు, రేపు అగ్రికల్చర్, ఫార్మసీ.. మే 2,3,4 తేదీల్లో ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు
- నిమిషం నిబంధన అమలు
- పరీక్ష కేంద్రాల వద్ద ఇంటర్‌నెట్, కాపీయింగ్ సెంటర్లు బంద్

ఖమ్మం ఖానాపురం హవేలి/చుంచుపల్లి(కొత్తగూడెం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఈ పరీక్షలను మంగళవారం నుంచి మే 4వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు, మే 2, 3, 4 తేదీలలో ఇంజనీరింగ్ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు.

ఖమ్మం జిల్లాలో మొత్తం 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 15,192 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఖమ్మంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, స్వర్ణభారతి (ఎస్‌బీఐటీ) ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం రూరల్ మండలంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, కొణిజర్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల, సత్తుపల్లిలో మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కళాశాల, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. భద్రాద్రి జిల్లాలో 2 కేంద్రాల్లో 1,888 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సుజాతనగర్ మండలంలోని అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాల, పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు.

కాగా, పరీక్షల నిర్వహణకు సంబంధించి నిమిషం నిబంధన అమలు చేస్తున్నారు. హాల్ టికెట్లపై గూగుల్ మ్యాప్‌తో లింక్ చేయబడిన క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. ఉదయం పరీక్షకు విద్యార్థులు 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు మధ్యాహ్నం 2 గంటల నుంచి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద కాపీయింగ్, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఆన్‌లైన్ పరీక్ష కావటంతో కరెంట్ సమస్యలు లేకుండా (మిగతా 6వ పేజీలో)



వర్షాకాలంలోగా మురుగునీటి పైపులైన్ పనులు

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ఉదయం కమిషనర్‌తో కలిసి పర్యటన
- ఖానాపురం ఊరచెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు...
- భూగర్భ డ్రెయినేజీ పనుల పరిశీలన

6



రైతులకు వరం 'భూ భారతి'

- ధరణి కష్టాలకు ఇక పూర్తిగా చెక్
- జూన్ 2నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు
- సాదాబైనామా, పెండింగ్ సమస్యల పరిష్కారం
- తిరిగి వీఆర్‌వోల వ్యవస్థ
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

6



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు

- 6 పరీక్షా కేంద్రాలు.. 2,739 మంది విద్యార్థులు
- అధికారుల సమీక్షలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 4న జరిగే నీట్ యూజీ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన అదనపు డీసీపీ ప్రసాదరావుతో కలిసి నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిధిలో నీట్ యూజీ ప్రవేశ పరీక్ష రాసే 2739 మంది విద్యార్థుల కోసం 6పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. పరీక్షకు ఒక రోజు ముందే పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాకుండా జాగ్రత్తలు వహించాలని, సీసీ టీవీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను పర్యవేక్షించాలన్నారు.

మే 4న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇవ్వాలని, మధ్యాహ్నం 1-30 నిమిషాలకు గేట్ మూసి వేయడం జరుగుతుందని, 1-40 లోపు విద్యార్థులు డాక్యుమెంట్ వెరిఫికేషన్ (ఐడీ కార్డు అలాటెడ్ సెంటర్) పూర్తి చేసుకుని పరీక్ష హాల్‌కు చేరుకోవాలని సూచించారు. నీట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.00గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో నీట్ జిల్లా నోడల్ అధికారి నరేంద్ర కుమార్, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డాక్టర్, బి.కళావతిబాయి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనివాసా చారి, తహసీల్దార్లు రవి కుమార్, రాంప్రసాద్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యానికి సకాలంలో కాంటాలు కాకపోవడంతో రైతులు ధాన్యం రాశుల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు మిల్లర్లు తరుగు పేరిట కోత విధిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లారీలు ఖాళీకాక ధాన్యం కొనుగోళ్లు ఆగిపోతున్నాయి. పడిగాపులతో విసిగిపోతున్న రైతులు ఆందోళనకు దిగుతున్నారు. అయితే ప్రభుత్వం తమకు ఇచ్చిన టార్గెట్లు పూర్తయ్యాయని, ఇక ధాన్యం కొనేది లేదని మిల్లర్లు స్పష్టం చేస్తున్నారు. దీంతో అధికారులు కూడా మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు చేస్తున్నారు.



ధాన్యం కొనరు.. కష్టాలు కనరు..

- యాసంగి ధాన్యం విక్రయంలో అన్నదాతల అరిగోస
- లారీల కొరతతో నిలిచిపోతున్న కొనుగోళ్లు
- తరుగు పేరుతో కోత పెడుతున్న మిల్లర్లు
- ధాన్యం రాశుల వద్ద రోజుల తరబడి రైతుల పడిగాపులు
- విసిగిపోయి ఆందోళనకు దిగుతున్న వైనం
- కొనుగోలు కేంద్రాలను పట్టించుకోని అధికారులు

కల్లూరు/ వైరా, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యం కేటాయించిన మిల్లులకు గత నాలుగు రోజులుగా దిగుమతులు కాని పరిస్థితి నెలకొంది. లారీల కొరత తీవ్రంగా వేధిస్తోందని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. ఈ దశలో జిల్లాలోనే పెద్దదైన పుల్లయ్యబంజర ఐకేపీ కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన ధాన్యం తేమ శాతం నిర్ధారణలో నిర్లక్ష్యం వహించిన ఓ మహిళ గ్రూపు సభ్యులను జిల్లా అధికారులు సస్పెండ్ చేస్తూ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ కేంద్రంలో కూడా గత నాలుగు రోజులుగా రైతుల నుంచి ధాన్యం సేకరణలో కాంటాలు నిలిచిపోయాయి.

నిలిచిన కాంటాలు

కల్లూరు మండల పరిధిలోని పుల్లయ్యబంజర, చెన్నూరు, పెద్దకోరుకొండి, పోచారం, తాళ్లూరు, వెంకటాపురం, చిన్నకోరుకొండి, వెన్నవల్లి, మర్లపాడు, కొర్లగూడెం తదితర గ్రామాల్లో గత నాలుగు రోజులుగా లారీల, గన్నీ సంచుల కొరతతో పూర్తిగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. మరో వైపున మిల్లర్ల వద్ద కూడ ధాన్యం దిగుమతిలో తీవ్రమైన జాప్యంతో సకాలంలో కేంద్రాలకు లారీలు చేరుకోక రైతులు అవస్థలు పడుతున్నారు. దీని అంతటికి అధికారుల మధ్య సమన్వయ లోపించటంతో ఈ సీజనల్ ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలు గ్రామాల (మిగతా 6వ పేజీలో)

నేలకొండపల్లిలో రైతుల ఆగ్రహం | ధాన్యం కొనుగోలు చేయాలని మార్కెట్ వద్ద ఆందోళన 6

ఇద్దరు ఎస్ఐలపై వేటు

- ఎర్రుపాలెం, బోనకల్ నుంచి సీపీఆర్‌కు బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఎస్ఐలపై బదిలీ వేటు పడింది. ఎర్రుపాలెం ఎస్ఐగా పనిచేస్తున్న పి.వెంకటేష్‌ను, బోనకల్ ఎస్ఐగా పనిచేస్తున్న పి.మధుబాబును ఖమ్మం సీఏఆర్‌కు బదిలీ చేస్తూ సోమవారం సీపీ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీచేశారు. కాగా ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పి.వెంకన్నను బోనకల్‌కు, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.రమేష్‌కుమార్‌ను ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీస్ స్టేషన్లలో జరుగుతున్న దందాలపై 'ఆంధ్రజ్యోతి'లో గత మూడురోజులుగా వార్తా కథనాలు ప్రచురితమవుతున్న విషయం విదితమే. ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసులో చోటుచేసుకున్న లొసుగులను వెలుగులోకి తీసుకువచ్చింది. కాగా వివిధ ఆరోపణలకు గురైన కొందరు సీఐలకు సైతం స్థానచలనం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

మొన్న భార్య... నేడు భర్త..

- యువజంట కాపురం విషాదాంతం
- కుటుంబ కలహాలతో నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం
- అదే రోజు భార్య మృతి..
- నాలుగు రోజుల తర్వాత భర్త మృతి



దీపిక, శ్రీను దంపతులు (ఫైల్)

టేకులపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓ యువ జంట క్షణికావేశంలో పురుగుల మందు సేవించిన ఘటనలో.. భార్య మృతి చెందిన నాలుగు రోజులకు చికిత్స పొందుతూ భర్త సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. టేకులపల్లి మండలంలోని వెంకట్యాతండాలో ఆర్నెల్ల క్రితం ప్రేమ వివాహం చేసుకొన్న బోడ శ్రీను (26), దీపిక(19)లు క్షణికావేశంలో గత గురువారం పురుగులమందు తాగగా శుక్రవారం (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో 'దిశ' సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

మౌలిక వసతులు కల్పించాలి

- అందుకోసం కేంద్ర నిధులు వినియోగించాలి
- వివిధ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చాలి
- 'దిశ' సమావేశంలో ఎంపీ రఘురాం రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపై సమగ్రంగా సమాచారం అందిస్తే వాటి మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 6ఏళ్ల వయస్సు గల పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పీఎంఈజీపీ ఇతర పథకాల కింద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు లాభం చేకూర్చాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో నూతన రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులతో సమావేశం నిర్వహించి వాటి మురుగు నీటి (మిగతా 6వ పేజీలో)

బీఆర్ఎస్‌వే 'కక్ష' రాజకీయాలు



- అధికారంలో ఉన్నప్పుడు అక్రమ కేసులు పెట్టలేదా?
- డబ్బులు పంచి సభకు జనాన్ని తరలించారు
- కాంగ్రెస్ నేతలు పువ్వాళ్ల, రాయల

6

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



- బీఆర్ఎస్ రజతోత్సవ సభే అందుకు నిదర్శనం
- ఏడాదిపాటు వేడుకలు నిర్వహిస్తాం
- నేతలు రవిచంద్ర, సండ్ర, కొండబాల

6

'మంచుకొండ'.. రైతులకు అండ

- ఎత్తిపోతల పథకం పనులు పూర్తి
- ట్రయల్ రన్ సక్సెస్
- 2,412 ఎకరాలకు సాగునీరు
- రికార్డు సమయంలో పనుల పూర్తి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి తుమ్మల
- సస్యశ్యామలం కానున్న రఘునాథపాలెం మండలం



ఖమ్మం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దశాబ్దాలకాలంగా సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న రఘునాథపాలెం మండలం సస్యశ్యామలం కాబోతుంది. సంక్రాంతి ముందు శంకుస్థాపన చేసిన మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసుకుని సోమవారం ట్రయల్‌రన్ విజయవంతమైంది. మంత్రి తుమ్మల అసెంబ్లీ ఎన్నికల తరుణంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం పేరుతో మండలానికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి అనుగుణం గా పట్టుబట్టి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి ఈ పథకాన్ని మంజూరు చేయించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్ర సాగునీటి సమస్య కలిగిన మండలంగా ఉన్న రఘునాథపాలెం మండలానికి మంచుకొండ ఎత్తిపోతల పథకం పేరుతో రూ.66.33 కోట్ల నిధులు మంజూరు చేయించారు. జనవరి 13న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేయించారు.

ఉగాది నాటికే నీళ్లు పారిస్తామని మంత్రి శంకుస్థాపన తరుణంలో హామీ ఇచ్చారు. అయితే కొన్నిపొలాల్లో పంటలు పూర్తికాకపోవడంతో పంటలు పూర్తయిన తర్వాత పైపలైన్లు పూర్తి చేసి మూడునెలల కాలంలోనే పూర్తి చేయించారు. వాస్తవానికి లిఫ్టులు కట్టాలంటే అధికారులు కనీసం ఏడాది సమయం తీసుకుని పూర్తిచేసే అవకాశం ఉంటుంది. మంత్రి తుమ్మల పలుసార్లు పర్యవేక్షించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను, పొలాల్లో పైపలైన్ నిర్మాణం కోసం రైతులతో చర్చించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

సాగునీటి సౌకర్యం లేని మండలం

జిల్లాలో రఘునాథపాలెం మండలం సాగునీటి సౌకర్యం లేని మండలంగా ఉంది. వర్షపు నీరే ఆధారంగా కొందరు, బోర్లు, బావుల ద్వారా రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు. పత్తి, మిర్చి వంటి పంటలతో పాటు కూరగాయలు, పండ్లతోటలు, విభిన్న తరహా పంటలతో ఈ మండలంలో గిరిజన, గిరిజనేతర రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయ పంటలు పండిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తితే కరువు కాటకాలకు గురై నష్టపోతున్నారు. ఇప్పుడు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు (మిగతా 6వ పేజీలో)



రైతులను సముదాయిస్తున్న అధికారులు

నేలకొండపల్లిలో రైతుల ఆగ్రహం

నేలకొండపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రోజుల తరబడి వేచి చూస్తున్నప్పటికీ తమ ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదంటూ రైతులు సోమవారం ఉదయం నేలకొండపల్లి మార్కెట్ ముందు ధర్నాకు దిగారు. మార్కెట్ గేట్లు మూసివేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ డిమాండ్ చేశారు. రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, సివిల్ సప్లయిస్ అధికారులు మార్కెట్ వద్దకు చేరుకుని రైతులను సముదాయించటానికి ప్రయత్నం చేశారు. .

అధికారులు రైతువేదికలో రైతుల సమక్షంలో మిల్లర్లతో చర్చలు జరిపారు. మిల్లర్లను ధాన్యం కొనుగోలు చేయటానికి ఒప్పించటానికి ప్రయత్నించారు. కానీ వారు కొనేది లేదని భీష్మించారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు పూర్తి అయ్యాయని, ధాన్యం నిల్వ చేయటానికి గోదాములు సైతం లేవంటూ కొనుగోలు చేయలేమంటూ చేతులెత్తేశారు. 5 వేల క్వింటాళ్లను కొనుగోలు చేయటానికి ఓ మిల్లర్‌ను ఒప్పించినప్పటికీ, ఇప్పటికే కాంటా వేసినవే 4వేలున్నాయని రైతులంటున్నారు. ఈ చర్చల్లో ఏఎంసీ చైర్మన్ సీతారాములు, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వరు, మండల వ్యవసాయాధికారి రాధ, సివిల్ సప్లయిస్ ఆర్ఐ నరేష్, ఏఈవో అరవింద్ పాల్గొన్నారు.

● వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతం ఇతర కారణాల సాకుతో కటింగ్ పేరుతో షరతులు పెట్టి ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రెండు రైతుసంఘాల ఆధ్వర్యంలో సోమవారం రైతులు రోడ్డెక్కారు. వైరా-మధిర, జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు.

ఫీజులను నియంత్రించాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని నిర్మూలించేందుకు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకరావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రజినీకాంత్, నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం మూడు రోజుల రాష్ట్ర మహాసభలు విజయవంతంగా జరిగాయని హర్షం వ్యక్తం చేశారు. సహకరించినవారందరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బాలిక విభాగం కన్వీనర్ పూజ, జిల్లా కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనరు.. కష్టాలు కనరు..

(5వ పేజీ తరువాయి)

రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్క పుల్లయ్యబంజర లోనే ఇంకా 70వేల బస్తాల ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయి.

కల్లాల్లోనే బస్తాలు..

వైరా మండలంలో నాలుగు రోజుల నుంచి ధాన్యం ఎగుమతులు నిలిచిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన వేలాది ధాన్యం బస్తాలు రోడ్లు, కల్లాల్లోనే ఉన్నాయి. లారీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ కొనుగోలు కేంద్రాల నుంచి లోడింగ్‌తో వెళ్లిన లారీల్లోని ధాన్యం బస్తాలను మిల్లర్లు సకాలంలో దిగుమతి చేసుకోవడం లేదు. ఇక్కడి నుంచే వెళ్లిన లారీలు ధాన్యంతో మిల్లులవద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

తరుగు కోసం ఒత్తిడి

ధాన్యం తరుగుదలకు రైతులు అంగీకరించకపోవడంతో వారిపై ఒత్తిడి పెంచేందుకు ఉద్దేశపూర్వకంగానే మిల్లర్లు లారీల్లోని ధాన్యాన్ని దిగుమతి చేయకుండా తీవ్ర కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్ల డిమాండ్‌కు తలొగ్గి ధాన్యం తరుగుకు అంగీకరించిన రైతులవి మాత్రమే దిగుమతి చేసుకుంటున్నారు. వ్యవసాయ శాఖ ఇచ్చిన యంత్రాలతో తూర్పార పట్టిన ధాన్యానికి కూడా తరుగు కింద కోత పెట్టేందుకు మిల్లర్లు డిమాండ్ చేస్తుండగా అలాంటి రైతులు తరుగుకు ససేమిరా ఒప్పుకోవడం లేదు. ఇప్పుడు ధాన్యం రైతుల పరిస్థితి మిల్లర్ల దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోంది. అయినప్పటికీ అధికార యంత్రాంగం కూడా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉంది. చివరికి క్వింటా ఒక్కంటికి రెండు కిలోల ధాన్యాన్ని తరుగు కింద ఇవ్వటానికి రైతులు అంగీకరించేలా మిల్లర్ల వత్తిళ్ల పనిచేశాయి. అయినప్పటికీ మూడు నుంచి ఐదు కిలోల తరుగుకు అంగీకరిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు భీష్మించుకొని కూర్చున్నారు.



పుల్లయ్యబంజరలో రవాణా కావి ధాన్యం బస్తాలు

మిల్లుల వద్దనే లారీలు..

జిల్లాలో నాలుగైదు పార్‌బాయిల్డ్ మిల్లులు మాత్రమే ఉన్నాయి. వాటిలో కూడా రెండు మిల్లులు బ్లాక్ లిస్టులో ఉన్నాయి. రన్నింగ్‌లో ఉన్న వాటికి డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా ధాన్యం కోతకు తెగబడుతున్నారు. దాదాపు 40 నుంచి 50లారీల్లోని ధాన్యం దిగుమతి కావాల్సి ఉంది. ఆ లారీలన్నీ మిల్లుల వద్దనే మూడ్నాలుగురోజుల నుంచి నిలిచిపోయి ఉన్నాయి. ఫలితంగా లారీల కొరత ఏర్పడింది. గరికపాడు సొసైటీ పరిధిలోని గరికపాడు, దాచాపురం, లింగన్నపాలెం గ్రామాల్లో ఇప్పటి వరకు 52,885 ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. వీటిలో ఇప్పటివరకు 40,557 బస్తాలను మిల్లులకు తరలించారు. ఇంకా 12,328 బస్తాలు కాంటా వేసి గత నాలుగురోజుల నుంచి లారీలు లేక రోడ్లు, కల్లాల్లో పడి ఉన్నాయి.

మొన్న భార్య... నేడు భర్త..

(5వ పేజీ తరువాయి)

దీపిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. కాగా భర్త బోడ శ్రీను కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

గత రెండు నెలలుగా దీపిక భర్త, అత్తమామలు, ఆడబిడ్డలు కట్నం తీసుకరావాలని ఆమెను వేధిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం వారందరూ దీపికతో గొడవపడ్డారు. అయితే ఘర్షణ జరుగుతున్న క్రమంలో దీపిక భర్త శ్రీను క్షణికావేశంలో మజా బాటిల్‌లో కలిపిన పురుగులమందును సేవించాడు. అది గమనించిన భార్య దీపిక కూడా బాటిల్‌ను లాక్కొని పురుగులమందు తాగింది. కుటుంబ సభ్యులు వారిని ముందుగా కొత్తగూడెం.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తీసుకెళ్లి చికిత్స చేస్తుండగా శుక్రవారం దీపిక మృతి చెందింది. చికిత్స పొందుతూ భర్త బోడ శ్రీను సోమవారం మృతి చెందాడు. పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకొన్న యువజంట ఆరునెలలు గడకముందే కుటుంబ ఘర్షణల నేపథ్యంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకొన్నాయి. మృతుడి తండ్రి బోడ వీరన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టేకులపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

'మంచుకొండ'.. రైతులకు అండ

(5వ పేజీ తరువాయి)

రఘునాథపాలెం మండంలలోని పలు చెరువుల్లో ప్రవహించి సస్యశ్యామలం కాబోతుంది.

2,412 ఎకరాల్లో సాగునీరు.

మంచుకొండ ఎత్తిపోతల ద్వారా వి.వెంకటాయపాలెం నుంచి సాగర్ జలాలు మండలంలో పలు గ్రామాలకు వెళ్లనున్నాయి. 2412 ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు మండలంలోని మంచుకొండ, చిమ్మపుడి, దారేడు, పాపటపల్లి, కోటపాడు, ఈర్లపుడి, రాంక్యాతండా, బడియాతండా, చింతగుర్తి, రఘునాథపాలెం, బల్లేపల్లి, ఖానాపురం, వేపకుంట్ల, కోణిజర్ల గ్రామాల్లోని మొత్తం 27 చెరువులతో పాటు ఈర్లపుడి, గడ్డికుంటతండాలో అదనపు ఆయకట్టు కింద వ్యవసాయ భూమి సాగులోకి రానుంది. మొత్తం 17 గ్రామాల్లో 2412 ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించడం, 27 చెరువులకు నీరు విడుదల ఈ ఎత్తిపోతల ద్వారా అందించడం జరుగుతుంది. వి.వెంకటాయపాలెం పాత లిఫ్టు సమీపంలోనే ఇక్కడ 600 హెచ్‌పీ మోటార్లు మూడు ఏర్పాటుచేశారు. 16.30 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు నిర్మించి మంచుకొండలో ఎత్తైన ప్రదేశంలో వాటర్‌ట్యాంకు నిర్మించి సోమవారం నీరు విడుదల చేశారు. ట్రయల్‌రన్ సక్సెస్ కావడంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల హర్షం వ్యక్తంచేశారు.

బీఆర్ఎస్‌వే కక్షపూరిత రాజకీయాలు: కాంగ్రెస్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో చిల్లర రాజకీయాలు చేసే రక్తం లేదని, ప్రజాస్వామ్యయుతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని డీసీసీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు సమయంలో కనీసం సొంత పార్టీ కార్యాలయం లేదని, ఇప్పుడు మాత్రం కార్పొరేట్ స్థాయిలో డబ్బులు, మాంసం పంచిపెట్టి ప్రజల్ని తరలించి వరంగల్ బహిరంగ సభ పెట్టారని ఆరోపించారు. పదేళ్లకాలంలో ప్రజాధనం దోచుకొని దాచుకున్నారని విమర్శించారు. నగరంలో మాజీ మంత్రి పుట్టినరోజు నుంచి వరంగల్ సభల వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా.. ప్రభుత్వం ఏ ఒక్క ఫ్లెక్సీని తొలగించలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాము ఫ్లెక్సీలు పెట్టినందుకు కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఖమ్మంలో ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తే బస్సులు ఇవ్వకుండా అడ్డుకున్నారని, ఖమ్మానికి వస్తున్న వాహనాలను అడ్డుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా పనిచేస్తున్న సీఎం, మంత్రులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా

» భద్రాద్రి సర్కిల్ ఎస్ఈ మహేందర్

కొత్తగూడెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు లోడ్‌కు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టామని భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీరు జి.మహేందర్ సోమవారం తెలిపారు. వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని తెలిపారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల మామకన్ను, గుండాల ఆళ్లపల్లి, సత్యనారాయణపురం, చర్లపల్లి మండలం 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ప్రాంతాల్లో కొత్తవి 4 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. పాల్వంచ మండలం మల్కారం, దమ్మపేట మండలం, అంకంపాలెం, లింగాలపల్లి, నారంవారిగూడెం, ప్రాంతాల్లో ఐదు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచడం జరిగిందని ఆయన తెలిపారు.

సింగరేణి ఆధ్వర్యంలో చెరువుల నిర్మాణం

కొత్తగూడెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల పెంపుదలే లక్ష్యంగా సంస్థ చైర్మన్ ఎన్.బలరాం నీటి బిందువు జల సింధువు పేరుతో ప్రారంభించిన మిని చెరువుల నిర్మాణ కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది. మే 15 నాటికి సింగరేణి వ్యాప్తంగా మొత్తం 12 ఏరియాల్లో 62 కొత్త చెరువుల నిర్మాణం, 40చెరువుల్లో పూడిక తొలగింపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్ని ఏరియాల జీఎంలకు, సంబంధిత పర్యావరణ, సివిల్‌శాఖల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

'పోస్టల్ సేవల్లో లోపం జరగకుండా చూస్తాం'

దుమ్ముగూడెం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఖాతాదారులకు సేవల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పోస్టల్ ఎస్పీ వీరభద్రస్వామి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఖాతాదారుల పాట్ల కథనంపై ఆయన సోమవారం మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ లోపంతో సమస్య తలెత్తిందన్నారు. ఖాతాదారులకు సేవల్లో ఎటువంటి జాప్యం తలెత్తకుండా దుమ్ముగూడెం సబ్-పోస్టాఫీస్‌కు పర్మినెంట్ పోస్టుమాస్టర్‌ను నియమిస్తామని లేదా మరో పోస్టల్ అసిస్టెంటును అదనంగా ఏర్పాటు చేస్తామన్నారు.

ఇందిరమ్మ కమిటీలకు ఝలక్

» పేర్లు తొలిగిస్తారంటూ ప్రచారం

చండ్రుగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల అబ్ధిదారుల ఎంపికలో తమకు ఎదురు లేదనుకున్న అధికార పార్టీ నాయకులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ప్రత్యేక అధికారులు ఝలకిస్తున్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో 3,714 మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా అధికారులు గుర్తించారు. కాగా తొలివిడతలో 732 మందికి ఇళ్లు మంజూరయ్యాయి ఈ ఇళ్లను ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులకు కేటాయించారు. ఆ జాబితాను ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులకు అప్పగించారు. దీంతో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మేము ఇచ్చిన జాబితానే ఫైనల్ అని వారందరికి ఇళ్లు మంజూరు అయ్యాయని గ్రామాల్లో ప్రచారం మొదలుపెట్టారు. ఈ సమయంలో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లతో మరోసారి పరిశీలన చేయిస్తుండడంతో నాయకులు, ఇందిరమ్మ కమిటీల సభ్యుల్లో ఆందోళన ప్రారంభమైంది. డేటాను పరిశీలించి అనర్హులను గుర్తించి ఇందిరమ్మ సభ్యులు ఇచ్చిన జాబితాలోని కొందరి పేర్లు తొలిగించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

ఇప్పటికే మూడు పంచాయతీల జాబితా ఫైనల్ అయింది. తొలగించిన వారి స్థానంలో నాయకుల అనుచరులకే తిరిగి ఇళ్లు మంజూరు చేయించుకునేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతుంది.

తాగునీటి సమస్య తలెత్తవద్దు: డీపీవో

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి చంద్రమౌళి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామపంచాయతీలలో ప్రజలతో కలిసి తాగునీటి బోర్లను పరిశీలించారు. ఉపాధి హామీ పనుల చేసే ప్రదేశాలలో నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో బోర్లు, వాటర్‌ట్యాంకులను క్రమం తప్పకుండా పరిశీలించలని సూచించారు.

బీఆర్ఎస్ సభలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మం జిల్లా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి హాజరుకావటం చర్చనీయాంశంగా మారింది. ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి భారతీరాణి సభావేదిక ముందు నిల్చొని అభివాదం చేస్తున్న ఫొటో సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. జ్యుడీషియల్ అధికారాలు కలిగిన కమిటీకి బాధ్యురాలిగా ఉంటూ రాజకీయ సభలో పాల్గొనవచ్చా.. అనే ప్రశ్నలు వ్యక్తమయ్యాయి. ఈ విషయమై భారతీరాణిని వివరణ కోరగా.. 'నాకు బీఆర్ఎస్‌లో ఎలాంటి సభ్యత్వం లేదు.. సభలో



ఏం మాట్లాడుతారో తెలుసుకోవాలనే ఉద్దేశంతో మాత్రమే వెళ్లాను..' అని తెలిపారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

» ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కొండబాల

ఖమ్మం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి, ఆవేదన పెరిగిపోవడంతోనే బీఆర్ఎస్ వరంగల్ సభకు భారీగా జనం తరలివచ్చారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావులు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ వరంగల్ సభకు యువత భారీగా తరలివచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రజానీకం మళ్లీ బీఆర్ఎస్‌ను కేసీఆర్‌నే కోరుకుంటోందన్నారు. అందువల్లనే వరంగల్ సభ సక్సెస్ అయ్యిందన్నారు. అన్ని గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు బస్సుల్లో వచ్చారన్నారు. అధికార పార్టీ నేతలు అనేక ఆటంకాలు సృష్టించినా జనం తరలివచ్చారన్నారు.

ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అందువల్లే వరంగల్ సభ సూపర్ డూపర్ హిట్ అయిందన్నారు. ఈ సభతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు మొదలయిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకుని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని, వరంగల్ సభతో ప్రజలు ప్రభుత్వానికి ఒక హెచ్చరిక ఇచ్చారన్న విషయం రాష్ట్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ప్రజల్లో అసంతృప్తి, ఆవేదనకు కారణాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన మంత్రులు బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం తగదన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య కొండబాల కోటేశ్వరరావులు మాట్లాడుతూ వరంగల్ సభకు భారీగా ప్రజలు తరలిరావడాన్ని అధికార కాంగ్రెస్ మంత్రులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ప్రైవేటు స్కూలు బస్సులు బీఆర్ఎస్ సభకు స్వచ్ఛందంగా ఇస్తే వారిని బెదిరించి అడ్డుకున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అందరం సమిష్టిగా కలిసి వరంగల్ సభకు జనసమీకరణ చేయగలిగామన్నారు. విలేకరుల సమావేశంలో ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, ఖమ్మం రూరల్ అధ్యక్షుడు బెల్లం వేణు, న్యాయవాది తిరుమలరావు, బీఆర్ఎస్ కార్పొరేషన్ డిప్యూటీ లీడర్ మక్బూల్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎప్‌సెట్

(5వ పేజీ తరువాయి)

చూడాలని, దూరప్రాంత విద్యార్థులకు పరీక్ష సమయానికి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలు, నీట్, గ్రూప్ 1, 2, 3 ,4 పరీక్షలు వివరాలను వెల్లడించే అధికారులు ఎప్‌సెట్ వివరాలను చెప్పటం లేదు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఏవైనా సమస్యలు వస్తే ఖమ్మం జిల్లా స్థాయిలో కోఆర్డినేటర్ లేకపోవటంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ యయాతిరాజు సూచించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. రింగ్‌రోడ్ సెంటర్‌లో విద్యార్థులు నాటిక రూపంలో మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు.

మౌలిక వసతులు కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

నిర్వహణపై సమీక్షించాలన్నారు. పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవసరం ఉన్నది, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అవసరమో ప్రతిపాదనలు అందించాలని సూచించారు.

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆడపిల్లలు పుడితే పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించే దిశగా జిల్లా యంత్రాంగం తరుపున స్వీట్ బాక్స్‌తో వెళ్లి ఆ కుటుంబాన్ని అభినందిస్తోన్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామంలో పీఎంజీకేవై, కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రేషన్ షాపులకు అవసరమైన మేర సన్న బియ్యం స్టాక్ తమ దగ్గర ఉందని, ప్రతి నెలా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాప్‌లకు తరలించాలని అన్నారు. ప్రతి రేషన్ షాప ఒకటో తేదీ నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని అన్నారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ తనికెళ్ల నుంచి కొణిజర్ల, పల్లిపాడు, వైరా మీదుగా రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి మండలంలో గాంధీపురం కేంద్రంగా అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. వైరా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి, జీఎం పరిశ్రమలు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ, మునిసిపల్ కమిషనర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పీడీ జాతీయ రహదారులశాఖ అధికారులు నివేదికలు వివరించారు.

పహల్గాం మృతులకు నివాళి

సమావేశానికి ముందు కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ఖమ్మం దిశ సమావేశంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో దీక్షా రైనా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై భేదాభిప్రాయాలు

» పరస్పర దాడికి పాల్పడిన నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ గృహాల ఎంపిక జాబితాలపై బేదాభిప్రాయాలు ఏర్పటంతో కల్లూరు పట్టణంలో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు పరస్పరం దాడికి దిగారు. సోమవారం కల్లూరు ఏఎంసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేశారు. సమావేశ అనంతరం అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన ఇరువురు నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై చర్చకు తెరలేపారు. ఇదే సమయంలో గతంలో కాలనీలో కాంగ్రెస్ నాయకులంతా సమావేశమై 15 మంది లబ్దిదారులతో జాబితా తయారు చేసి ముందుగానే సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో ప్రధాన నాయకుడికి పంపాగా, మరో జాబితా ఎందుకు తయారు చేయాల్సి వచ్చిందని మరో కాంగ్రెస్ నాయకుడు వాదనలకు దిగి ఘర్షణకు పాల్పడ్డారు. ఈ సమయంలో వారిద్దరు పరసర్పం చేయి చేసుకొన్నారు. మరల చంద్రుపట్ల రహదారి వద్ద కూడ పై విధంగా ఘర్షణకు పాల్పడి ఒకరిపై మరొకరు చెయ్యి చేసుకున్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై ఇరు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లినట్లు సమాచారం.

రైతులకు వరం 'భూ భారతి'

» జూన్ 2నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు

» సాదాబైనామా, పెండింగ్ సమస్యలకు పరిష్కారం

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

అశ్వారావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులు పడిన కష్టాలకు చెక్ చెప్పేందుకు భూ భారతి చట్టాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం తెచ్చిందని, ఈ చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన భూ భారతి చట్టం-2025పై జరిగిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రైతుల భూములకు భద్రత కల్పన, భూ రికార్డుల నమోదు, అంచెలవారీగా పని విభజన, రెవెన్యూ రికార్డులు ప్రైవేటు చేతుల నుంచి ప్రభుత్వ ఆధీనంలోకి తేవడం వంటి అనేక సమస్యలకు పరిష్కారాన్ని కల్పిస్తూ భూ భారతి చట్టం తీసుకు వచ్చామని అన్నారు. ఈ పథకం రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని ప్రకటించారు. భూ సమస్యల పరిష్కారానికి రైతులు కార్యాలయాల చుట్టు తిరగాల్సిన అవసరం లేదని, మీమీ గ్రామాల్లో అవగాహన సదస్సులు పెట్టి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని అన్నారు.

ధరణి పేదలకు తీవ్ర నష్టాన్ని తెచ్చిందని, కొందరు పింక్ నాయకులకు ఒక్కొక్కరు పెద్ద ఎత్తున భూములు లేకున్న పాస్ పుస్తకాలు తెచ్చుకొని లక్షలాది రూపాయల రైతుబంధును కాజేశారన్నారు. తాతల కాలం నాడు భూములు కొనుగోలు చేసుకొని ఆర్థిక ఇబ్బందులతో రిజిస్ట్రేషన్ చేయించుకోలేక సాదా బైనామాల కోసం దరఖాస్తులు పెట్టుకున్న 9,26,000ల దరఖాస్తులకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం దొరుకుతుంన్నారు. ఇవేకాక దొరవారి పాలనలో వివిధ రకాల సమస్యలతో పెండింగ్‌లో ఉన్న 5,40,000 దరఖాస్తులకు మోక్షం లభించనుందన్నారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకో మండలాన్ని ఎంపిక చేసుకొని పైలెట్ మోడల్‌గా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం జిల్లాలో సుజాతనగర్ మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా సాగులో ఉన్న అనేక మంది గిరిజనులు, గిరిజనేతర సమస్యలకు శాశ్వత పరిష్కారానికి త్వరలో ప్రత్యేక కమిటీని వేస్తామని మంత్రి ప్రకటించారు. గతంలో తాను అశ్వారావుపేటకు వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సర్వేనెం.911, 152లో భూముల సర్వే కోసం వినతి చేశారని, ఆ రోజు చెప్పిన మాట ప్రకారం ఇప్పటికే 911 సర్వే నెంబర్‌లో సర్వే పూర్తి అయ్యిందని, 152లో కూడా రెండు మూడు రోజుల్లో సర్వే ప్రారంభమవుతుందని వివరించారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చామని, ఇందులో మొదటి దఫాలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగ 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించారు.

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో సర్వే నెం. 911, 152లో భూ సమస్యల పరిష్కారానికి సర్వే పూర్తి చేసుకున్నామని తెలిపారు. కలెక్టర్ జితేష్ వీ పాటిల్ మాట్లాడుతూ భూ భారతి చట్టం-2025 వల్ల లాభాలు, గతంలో ధరణిలో పేరుకొని పోయిన సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ధరణివల్ల తమ భూములు ఏ విధంగా పెండింగ్‌లో పడ్డాయో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సదస్సులో ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, హౌసింగ్ పీడీ శంకర్, మునిసిపల్ కమిషనర్ సుజాత, అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, జూపల్లి రమేష్, నుంకవల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ నూతన భవనాల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

వర్షాకాలంలోగా మురుగునీటి పైపులైన్ పనులు

» అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

» భూగర్భ డ్రైయినేజీ పనుల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం నగరంలో చేపట్టిన భూగర్భ డ్రైయినేజీ పనుల్లో భాగంగా మురుగునీటి పైపులైన్ పనులు రాబోయే వర్షాకాలంలోగా పూర్తిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నగరంలో చేపట్టిన భూగర్భ డ్రైయినేజీ నిర్మాణ పనులను సోమవారం ఉదయం 5 గంటలకే కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అమృత్ పథకం కింద రూ.189.50 కోట్లతో చేపట్టిన భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులను సత్వరం పూర్తిచేయాలన్నారు. ఖానాపురం ఊరచెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు 9.6 కి.మీ మురుగు నీటి పైపులైన్ నిర్మించి అంతర్గత పైపులైన్లను అనుసంధానం చేసి మురుగునీటి శుద్ధి కేంద్రానికి తరలించాలన్నారు. ధంసలాపురంలో 44 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో, పుట్టకోట వద్ద 9.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తామన్నారు. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు రెండునెలల్లో పనులు పూర్తికావాలని సూచించారు. మరోసారి తాను పర్యటనకు వచ్చినప్పుడు అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనుల్లో పురోగతి ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దన్నారు. వైరా రోడ్డులోని యూజీడీని సందర్శించి పనులపై నివేదిక ఇవ్వాలని కోరారు. మంత్రి పర్యటనలో ఖమ్మం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

సివిల్ కాంట్రాక్టర్ ఆత్మహత్య?

పాల్వంచ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నవభారత్ కర్మాగారంలో సివిల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న ఉప్పాల గిరి(58) ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన ఉప్పాల గిరి నవభారత్ కర్మాగారంలో సివిల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ప్లాంట్‌లోని కూలింగ్ టవర్ ప్రాంతానికి పనిమీద వెళుతుండగా కార్మికులు గమనించారు. ప్రతి రోజూ గిరి అదే ప్రాంతంలో పనులు చేయిస్తుండటంతో ఎవరూ అనుమానించలేదు. కానీ మధ్యాహ్నం అదే ప్రాంతంలో విధులు నిర్వహించడానికి వెళ్లిన కార్మికులు గిరి మృతదేహాన్ని కూలింగ్ టవర్‌లో గుర్తించారు. వెంటనే యాజమాన్యానికి సమాచారం అందించారు. వారు పాల్వంచ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా టవర్ ప్రాంతంలో గిరి చేతి వాచీ, సెల్‌ఫోన్‌లను పోలీసులు గుర్తించారు. దీంతో గిరి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య లతతో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు స్వీకరించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాత పాల్వంచలోని పేకాట స్థావరంపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు , ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

మున్నేరులో పడి మత్స్యకారుడి మృతి

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మున్నేరులో పడి ఓ మత్స్యకారుడు మృతిచెందిన సంఘటన ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. నగరానికి చెందిన మర్రి వీరస్వామి(48) గత కొన్ని ఏళ్లుగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్లలో నివాసముంటున్నాడు. చేపలు పట్టేందుకు ఆదివారం సాయంత్రం ఖమ్మంకు వచ్చిన తెప్పపై మున్నేరులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఆలస్యంగా గుర్తించిన తోటి మత్స్యకారులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించటంతో వారు సంఘటనాస్థలంకు చేరుకొని మృతదేహన్ని వెలికితీశారు. మృతుని కుమారుడు ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైలు క్రింద పడి మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని జహీర్‌పురకు చెందిన దోస్‌వాన్ జయ(52) అనే మహిళ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో సోమవారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సేపటి తర్వాత రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడకు చేరుకొని అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని బలవన్మరణం

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని డిగ్రీ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన తెల్లగొర్ల ప్రసన్న(20) పాల్వంచలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. నాలుగు రోజుల క్రితం పరీక్షలు రాసేందుకు పాల్వంచకు వెళ్లింది. పరీక్షలు వాయిదా పడటంతో తన తండ్రికి తెలిపి ఇంటికి వస్తానని చెప్పింది. అయితే పరీక్షలు పూర్తయిన తరువాత ఇంటికి రావాలని సూచించారు. ఈక్రమంలో ఇంటికి దూరంగా ఉండి చదువుకోవటం ఇష్టం లేక సోమవారం ఉదయం ఇంటికి వచ్చింది. ఈసమయంలో కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లటం, తండ్రి మాటలకు మనస్తాపం చెందిన ప్రసన్న ఇంటికి వచ్చి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యయాతిరాజు వివరించారు.

పల్లె ప్రకృతి వనం దగ్ధం

తల్లాడ, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): తల్లాడలో సోమవారం పల్లె ప్రకృతి వనం దగ్ధమైంది. మంగాపురంరోడ్డులో ఉన్న తల్లాడకు చెందిన పల్లె ప్రకృతి వనానికి నిప్పంటుకుని మంటలు వ్యాపించి చెట్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఈవో కృష్ణారావు పంచాయతీ సిబ్బందితో వచ్చి ట్యాంకర్‌తో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. వైరానుంచి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. పత్తికట్టెకు నిప్పుపెట్టడం వల్లప్రమాదం జరిగినట్లు తెలిసింది

‘ఉపాధి’ పనుల్లో మృతదేహం అవశేషాలు

సత్తుపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పని ప్రదేశంలో మానవ మృతదేహం అవశేషాలు బయట పడినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి పరిధిలో యూకలిప్టస్ ప్లాంటేషన్ సమీపంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. మట్టి పనుల్లో భాగంగా తవ్వకాలు జరుపుతుండగా మానవ పుర్రె బయటపడటం కూలీలు గుర్తించారు. చాలా కాలం క్రితం మృతదేహాన్ని అక్కడ పూడ్చిపెట్టి ఉంటారని భావిస్తున్నారు. దీనిని అధికారులు ధ్రువీకరించలేదు.

చోరీ కేసులో ఏడాది జైలుశిక్ష

భద్రాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చర్ల మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కారం కృష్ణమూర్తి అనే వ్యక్తికి ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఏడాది జైలుశిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ సోమవారం తీర్పు వెల్లడించారు. 2022 సెప్టెంబరు 4న దుమ్ముగూడెం మండలం పాతమారేడుబాకకు చెందిన మట్టా వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనం భద్రాచలంలో చోరీకి గురైంది. దీంతో అప్పటి సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి కృష్ణమూర్తి ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేశారు.





వినాయక పురం మధ్యలోని వంతెనలు



కట్కూరు సమీపంలోని బ్రిడ్జీ

పూసుకుంటకు ప్రగతి బాట

- రూ.5కోట్లతో మూడు బ్రిడ్జీల నిర్మాణం పూర్తి
- నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

దమ్మపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అటవీ గ్రామమైన పూసుకుంటకు ఎట్టకేలకు రహదారి నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఆ రోడ్డుపై మూడు చోట్ల నిర్మించిన వంతెల నిర్మాణం పూర్తికాగా మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. పూసుకుంట గ్రామానికి రోడ్డు లేకపోవడంతో పలుమార్లు అక్కడి కొండరెడ్లు మంత్రి తుమ్మల నాగేశ్వరావును కలిసి రోడ్డు కోసం విన్నవించారు. పూసుకుంట రోడ్డుకు పదేళ్ల క్రితం రూ.25 కోట్లు అప్పట్లో ఆర్‌అండ్‌బీ మంత్రిగా మంజూరు చేశారు. కటుకూరు గ్రామం నుంచి దమ్మపేట మండలం వినాయకపురం వరకు జరగాల్సిన ఈ రోడ్డు పనులు కొంత మేరకు పూర్తవగా అటవీ అనుమతుల కారణంగా మధ్యలోనే ఆగిపోయాయి. కటుకూరు నుంచి పూసుకుంట వరకు బీటీ రోడ్డు నిర్మించినా, అక్కడ నుంచి వినాయకపురం వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రోడ్డు నిర్మాణం కోసం మంత్రి తుమ్మల విశేషంగా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగానే రోడ్డు మధ్యలో మూడు బ్రిడ్జీల నిర్మాణానికి మూడు నెలల క్రితం రూ.5కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ఈ మూడు బ్రిడ్జీల నిర్మాణం పూర్తవగా మంగళవారం మంత్రి తుమ్మల ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పూసుకుంటను అప్పటి గవర్నర్ తమిళిసై దత్తత తనుకున్నప్పటికీ రహదారి సమస్యను పరిష్కరించలేకపోయారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో పూసుకుంట గ్రామానికి మహర్దశ వచ్చినట్లయింది. దీంతో పాటు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం తుమ్మల సూచనలతో కొండరెడ్ల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు కొండరెడ్ల చేతివృత్తులకు ప్రభుత్వం శిక్షణ కల్పించి వారికి అవసరమైన యానిట్లను అందించేందుకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి పూసుకుంట గ్రామంలో సర్వే చేయటంతో యానిట్లను అందించనున్నారు.

మెడికల్ కాలేజీకి శరీర దానం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా సీపీఎం సీనియర్ నాయకుడు కొనిజర్ల మండలం లాలాపురానికి చెందిన సంక్రాంతి మధుసూదన్ రావు మృతదేహాన్ని వైద్యవిద్యార్థుల ప్రయోగాలకోసం అందజేశారు. ఆయన ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. మరణించిన తర్వాత వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న ఆయన కోరిక మేరకు సోమవారం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, రాజేశ్వరరావు అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ చండిప్రియ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ నారగాని రాంప్రసాద్ సమక్షంలో మధుసూదన్ రావు కుమారుడు సంక్రాంతి రవికుమార్, నామ వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు కళ్యాణ వెంకటేశ్వరరావు, చింత నిప్పు చలపతిరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి లాలాపురం నివాసి కన్నెగంటి వెంకటయ్య, సంక్రాంతి రవికుమార్, వైరా పట్టణ సీఐటీయూ నాయకులు అనుమోలు రామారావు, లాలాపురం మాజీ సర్పంచ్ సంక్రాంతి చంద్రశేఖర్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు

దైవ దర్శనానికి వెళ్తూ..

- ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం
- తీవ్ర గాయాలతో వ్యక్తి దుర్మరణం



శ్రీను(ఫైల్)

పినపాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మొక్కుల కోసం వేములవాడ వెళుతున్న క్రమంలో తాడ్వాయి అడవిలో రండగడాపురం వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గోపాలరావుపేటకు చెందిన గోరంట్ల శ్రీను(48) అక్కడికక్కడే మృతి చెందారు.గోపాలరావుపేట గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీను కుమారుడి వివాహం అనంతరం మొక్కుచెల్లింపు కోసం కుటుంబ సభ్యులతో ఆటోలో సోమవారం తెల్లవారున వేములవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో తాడ్వాయి అడవిలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలు ముందు కూర్చున్న శ్రీను తలకు తీవ్రం గాయం కావడంతో అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలోని వారికి స్వల్ప గాయాలయ్యాయి. గోరంట్ల శ్రీను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుముఖ్య అనుచరుడు. శ్రీను భార్య కూడా పదేళ్ల క్రితమే మృతిచెందారు. ఆయనకు ఇద్దరు వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడి వివాహం అయిన నాలుగు రోజులకే రోడ్డు ప్రమాద రూపంలో శ్రీను అకాల మరణం చెందడంతో ఆ కుటుంబంలో, గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మైనర్లకు బైకులు ఇస్తే కేసులు

- వారంలో 266డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు
- పోలీస్ కమిషనర్ సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు బైకులు ఇస్తే పేరెంట్స్‌పై కేసులు నమోదుచేస్తామని, పోలీసుకమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డుప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రత్యేకంగా దృష్టిపెట్టి జిల్లా వ్యాప్తంగా పోలీసుయంత్రాంగం స్పెషల్ డ్రైవ్ చేపడుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఏడురోజుల్లో దాదాపు 31మంది మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారని 266 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌చేస్తూ పట్టుబడ్డారన్నారు. ఇప్పటికే పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులు వాహనయజమానులపై ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదుచేసి వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, కాలేజీలకుసెలవుల నేపథ్యంలో పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈఏడాది మూడునెలల్లో 243 రోడ్డు ప్రమాదాలు జరిగితే 84మంది మరణించారని, మరో 686 మందికి తీవ్రగాయాలయ్యాయన్నారు. ఖమ్మంనగరంలో కూడా ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదుచేస్తున్నట్లు తెలిపారు.

కోడలు ఇంటిముందు వృద్ధురాలి నిరసన

- ఎకరం పొలం అయినా ఇవ్వాలంటూ వేడుకోలు



వృద్ధురాలు సీతమ్మ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తన ఎకరం పొలం తనకు ఇవ్వాలంటూ కోడలు ఇంటి ముందు బైటాయించిన ఘటన అశ్వారావుపేట మండలంలో సోమవారం జరిగింది. నారంవారిగూడెం కాలనీకి చెందిన రాజాలు, సీతమ్మ వృద్ధ దంపతులకు ఏడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కొన్నేళ్ల క్రితం తమ కుమారుడికి ఐదు ఎకరాల పొలం ఇచ్చారు. మిగిలిన రెండు ఎకరాలను దంపతులు ఉంచుకుని జీవనం సాగిస్తున్నారు. పదేళ్ల క్రితం కుమారుడు పుల్లారావు, మూడేళ్ల క్రితం భర్త రాజాలు మృతిచెందారు. దీంతో సీతమ్మ తమ వద్ద ఉన్న మరో ఎకరం పొలాన్ని కూడా కోడలుకు ఇచ్చింది. ఇదే తరుణంలో రెండు ఎకరాల భూమిని పట్టా చేయించుకుంది కోడలు. ఈనేపథ్యంలో సీతమ్మను సక్రమంగా చూసుకోకపోవటంతో ఇదే గ్రామంలో ఉండే కూతురు తిరుపతమ్మ వద్ద ఉంటోంది. కూతురి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటం, తన జీవన పరిస్థితి మరీ దిగజారటంతో తన పొలం తనకు ఇవ్వాలని కోడలిని కోరింది. పోలీసులను, తహసీల్దారు కార్యాలయాన్ని ఆశ్రయించింది సీతమ్మ. అక్కడ తనకు న్యాయం జరగటంలేదంటూ కోడలి ఇంటి ముందు ఎండలోనే బైటాయించింది.

భూ సర్వే జరగకనే సమస్యలు

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో భూ భారతి అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సత్తుపల్లి/వేంసూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూములన్నీ సర్వే జరిగి వందేళ్లు అయిందని, గత వందేళ్ల కాలంలో భూ సర్వే జరగకపోవటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం సత్తుపల్లిలో జరిగిన భూ భారతి (భూమి హక్కు) చట్టం-2025 అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. భూమి మొత్తం సర్వే జరిగి కమతాల వారీగా హద్దులు నిర్ణయిస్తే వివాదాలు ఉండవని అన్నారు. కొత్త వచ్చిన చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక లైసెన్స్‌డ్ సర్వేయర్ ఉంటారని, వారిపై ప్రభుత్వ మండల సర్వేయర్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. డిజిటల్ టెక్నాలజీతో జరిగే సర్వేలో ప్రతి అంగుళం భూమి కచ్చితమైన లెక్కవస్తుందన్నారు. కొత్త చట్టం ప్రకారం అప్పీల్‌కు అవకాశం ఉందని వివరించారు. భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సూచించారు. ధరణి పోర్టల్ స్థానంలో వచ్చిన భూ భారతి చట్టం వచ్చిందన్నారు. భూ భారతి చట్టం రూపొందించే ముందు భూ యజమానులు, విశ్రాంత న్యాయమూర్తులు, అధికారులతో చర్చించి రూపొందించినట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి అర్ధరాత్రి ధరణి చట్టం తెచ్చారని దాని వల్ల ఎదురైన ఇబ్బందులు అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యవేక్షణలో భూ భారతి చట్టం రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కల్లూరు ఆర్డీవో రాజేందర్ గౌడ్, సత్తుపల్లి, వేంసూరు తహసీల్దార్లు యోగేశ్వరరావు, బాబ్జి ప్రసాద్ పాల్గొన్నారు.

జూదంపై ఉక్కుపాదం

- ఎస్పీ రోహిత్ రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం/దమ్మపేట ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, పేకాట, బెట్టింగ్‌కు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కఠినచర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరించారు. సోమవారం దమ్మపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలుచేశారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచి దొంగతనాల కట్టడికి కృషి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పని చేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్‌నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా చేపట్టాలని సూచించారు. సైబర్‌నేరాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్‌ఐ సాయికిషోర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా లబ్ధిదారులను గుర్తించాలి

- ఐటీడీఏ పీవో రాహుల్



అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎవరి ఒత్తిడికిలోను కాకుండా ఎటువంటి పక్షపాతానికి తావు ఇవ్వకుండా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారులను గుర్తించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ స్పెషల్ ఆఫీసర్లకు సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్లతో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన కమిటీలో తీసుకోవలసిన కార్యాచరణపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 మండలాలు, నాలుగు మునిసిపాలిటీల్లో జరిగే దరఖాస్తుల పరిశీలనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ పథకానికి 21,792 మంది గిరిజన యువతి యువకులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వేసవి సెలవులు నడుస్తున్నందున గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

ఐటీడీఏ పీఎంఆర్‌సీ భవనంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 27 మందిని భద్రాచలం జోన్‌కు పంపారని, సర్టిఫికెట్ల తనిఖీ అనంతరం కౌన్సెలింగ్ ద్వారా పోస్టులు కేటాయిస్తామన్నారు.

క్రీడాకారులకు అభినందన..

ఏపీలోని వైజాగ్ గీతం యూనివర్సిటీలో జరిగిన వివిధ రాష్ట్రస్థాయి గిరిజన ఆర్చరీ క్రీడల్లో భద్రాచలం ఐటీడీఏ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన క్రీడల్లో ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్, ఒడిశా, అండమాన్ నికోబార్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి గిరిజన విద్యార్థులు పాల్గొన్న ఆర్చరీ క్రీడల్లో భద్రాచలం తరపున ఆర్చరీ క్రీడల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న క్రీడాకారులను పీవో రాహుల్ అభినందించారు. అనంతరం రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడల్లో పాల్గొని మెడల్స్ సాధించిన విద్యార్థులకు పతకాలు అందించి అందరికీ అభినందనలు తెలిపారు.

సాగర్ కాల్వల మరమ్మతుల ఊసేది?

- శాశ్వత పనులపై దృష్టిసారించని పాలకులు
- నాడు హడావిడి.. నేడు స్తబ్దత
- సీఎం పర్యవేక్షించిన ప్రాంతాలపై శీతకన్ను

కూసుమంచి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది పాలేరుకు వరదలతో కొట్టుకపోయిన ప్రాంతాల్లో శాశ్వత మరమ్మతులవైపు పాలకులు దృష్టిసారించలేదు. వరదల సమయంలో ఆప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అప్పటికప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేసిన అధికారులు ఆ తర్వాత ఆవైపు కన్నెత్తి చూడలేదు.

భారీ వర్షాలతో గండ్లు..

గత ఏడాది సెప్టెంబరు 1న వచ్చిన భారీ వర్షాల కారణంగా పాలేరు జలాశయానికి భారీస్థాయిలో వరద పోటెత్తింది. దీంతో నాగార్జునసాగర్ ఎడమకాల్వకు పెద్దఎత్తున గండ్లు పడ్డాయి. పాలేరు జలాశయానికి సమీపంలో కూసుమంచి మండలంలో మల్లాయిగూడెం వద్ద 134.5 కిలోమీటరు వద్ద గండి పడింది. ఆప్రాంతంలోనే అండర్ టన్నెల్ (యూటీ)కూలిపోయింది. ఎగువన మొదటిజోన్ పరిధిలో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో 132.5 కిలోమీటరు వద్ద భారీగా గండ్లు పడ్డాయి. కాల్వ నీళ్ల వల్ల వేల ఎకరాల్లో పంటలను ముంచెత్తాయి. ఇసుక మేటలు వేసింది. యూటీ నిర్మాణం లేకపోవడంతో మోటార్ల సాయంతో పొలాల్లో నీటిని ఎత్తిపోశారు.



మల్లాయిగూడెం వద్ద కాల్వకు గండిపడిన ప్రాంతం

సాగర్ ఎడమకాల్వకు యాసంగిసాగుకు ఇటీవల అధికారులు 20 రోజులక్రితం నీరు నిలిపివేశారు. నీరు నిలిపి వేసిన వెంటనే యూటీలను, కాలువలను పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేయిస్తూ వచ్చే వానాకాలం నాటికి సిద్ధం చేయాలి. ఈబాధ్యత జిల్లాకుచెందిన అమాత్యులతో పాటు అధికారులదే. కానీ ఆఊసే లేకుండా పోయింది. కనీసం ప్రతిపాదించిన పనులకు నిధులను మంజూరీ చేయించే పరిస్థితి లేకుండా పోయింది.



పాలేరు ఫాలింగ్ గేట్ల వద్ద దెబ్బతిన్న ప్రాంతం

రూ.14 కోట్లతో ప్రతిపాదనలు

సాగర్ ఎడమకాల్వపై పడిన గండ్ల పూడ్చివేతకు అధికారులు రూ.14కోట్లుతో ప్రతిపాదనలు పంపించారు. మల్లాయిగూడెం వద్ద, కాగిత రామచంద్రాపురం వద్ద గండ్లను పూడ్చటం, పాలేరు జలాశయం నుంచి జాతీయ రహదారి వరకు ఎడమకాల్వకు సుమారు కిలోమీటరు మేరు లైనింగ్ చేయాల్సి ఉంది. ఇన్‌ఫాల్, అవుట్ ఫాల్‌గేట్లు మరమ్మతులు, కాల్వకు లోపల, బయట జంగిల్ క్లియరెన్స్ పాలేరు ఫాలింగ్ గేట్ల వద్ద మరమ్మతులు చేయాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం: ఎస్ఈ మంగళపూడి

సాగర్ కాల్వల మరమ్మతుల ప్రతిపాదనలు పంపించాం. మంజూరీ రావల్సి ఉంది. రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. వచ్చే సీజన్ నాటికి పనులు పూర్తి చేస్తాం.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సర్వే

తిరుమలాయపాలెం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు సర్వేచేపట్టారు. కాకరవాయి, రఘునాథపాలెం, పిండిప్రోలు, తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం, బీరోలు, ఐచ్చేడు, తదితర గ్రామాల్లో సర్వే చేపట్టారు. మండలంలోని 40గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపీడవో సిలార్‌సాహెబ్, ఏవో సీతారాంరెడ్డి ఎంపీవో సూర్యానారాయణ, డీటీ నరసింహారావు తదితరులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. సర్వే జాబితాను జిల్లా అధికారులకు అందించనున్నారు ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్ ఓర వెంకటేశ్వర్లు, నిమ్మల వెంకన్న, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని అన్నారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఆమె సమీక్షించి పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజ,ఎస్సీఎస్టీ, బీసీ సంక్షేమఅధికారులు సత్యనారాయణ, విజయలక్ష్మీ, జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

● నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన ఎం.వేంకటేశ్వర్లు, అచార్లగూడెం గ్రామ రెవెన్యూలో సాయిలక్ష్మి పారా బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ కాలుష్యం వల్ల పంటనష్టం, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.

● ముస్తాఫానగర్‌కు చెందిన షేక్ సైదమ్మ వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

● దాచాపురం గ్రామానికి చెందిన ఎం. రాజా ఇందిరమ్మ గృహసమగ్ర సర్వేలో అక్రమాలు జరిగాయని, అనర్హులకు ఇళ్ల కేటాయింపు చేశారని ఫిర్యాదు చేశాడు.



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై నిర్ణీత గడువు ప్రకటించి పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారం జరిగింది లేదా అని అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామన్నారు. పారిశుధ్యం ఇతర సమస్యలను ఆదేరోజు పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. ఈఈ కృష్ణలాల్, ఆర్వో శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఏవో శివలింగం, గుడిపూడి సుజాతరాణి, సాంబయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

- భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం
- నేషనల్ హైవే బాధితులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమీక్ష



రైతులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని, జాతీయ రహదారుల భూనిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన పరిహారాన్ని అందిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం ఖమ్మం ఆర్డీవో కార్యాలయం లో నేషనల్ హైవే ప్రాజెక్ట్ భూసేకరణ నిర్వాసితులతో కలెక్టర్ సమీక్షించారు. చింతకాని మండలంలోని కోదుమూరు, వందనం గ్రామాల్లో భూసేకరణ చేసే భూయజమానులు, రైతులతో కలెక్టర్ నష్ట పరిహారంపై చర్చించారు. రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు ఏకరువుపెట్టారు. జాతీయ రహదారి సూర్యాపేట దేవరపల్లి నూతన రహదారి కారణంగా పొలాలు నష్టపోయామని, గ్రామాల నుంచి అమరావతి నాగపూర్ రోడ్డు రావడం ఈ రెండు రోడ్ల వలన గ్రామంలో చిన్నసన్న కారు రైతులు భూములు పూర్తిగా కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. భూమిలో ఉన్నపైపులు,కట్టడాలు,ప్రస్తుతం ఉన్న పంటలు సుబాబులు జామాయిలు సర్వే చేసి అవార్డు చేసిన తర్వాత సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, భూసేకరణకు అవార్డ్ పాస్ చేసినట్లు, ప్రభుత్వ పరిధిలో ఉన్న మెరుగైన పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో గ్రామాలకు ప్రత్యేకంగా సర్వీస్ రోడ్ మంజూరుకు చర్యలు తీసుకున్నారన్నారు. హైవేతో మిగులు భూములకు సర్వీస్ రోడ్‌తో డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. ఇది రైతులకు, ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, చింతకాని తహసీల్దార్ అనంతరాజు, హైవేఅధికారులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్ పోస్టర్ల ఆవిష్కరణ

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రచార పోస్టర్లను సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ అబిషేక అగస్త్య, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బి.పురందర్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు నాగేందర్‌రెడ్డికి సన్మానం



సీనియర్ జర్నలిస్టు నాగేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మారెడ్డి నాగేందర్ రెడ్డికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు వచ్చిన సందర్భంగా జర్నలిస్టుల మిత్రబృందం ఆధ్వర్యంలో నగరంలో ఓ ఫంక్షన్‌హాల్లో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే ప్రతీజర్నలిస్టు ప్రజల గుండెల్లో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ప్రసేన్, మధు, సాంబశివరావు, ఆదినారాయణ, నరసింహారావు, శ్రీను, విజేత, పుల్లారావు, చలమయ్య,వెంకటేశ్వరరావు, మహేష్, ఖదీర్, శ్రీనివాసరెడ్డి, వేణు, సీతారామ్, లక్ష్మణశర్మ, ప్రసాద్, శ్రీనివాస్, యాకేష్, భూపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటితో ముగుస్తున్న 'ఎర్లీబర్డ్'

- గతేడాది రూ.9కోట్ల ఆదాయ వసూలు
- ఈ ఏడాది లక్ష్యం రూ.10కోట్లు
- ఇప్పటి వరకు రూ.7.61 కోట్లు మాత్రమే వసూలు
- లక్ష్యం కోసం ప్రయత్నిస్తున్నాం: శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి



ఖమ్మంసంక్షేమ విభాగం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ఎర్లీబర్డ్ పథకం ద్వారా రెవెన్యూ ట్యాక్స్ చెల్లింపులకు రేపటితో గడువు ముగియనున్నది. కాగా ఈ ఏడాది లక్ష్యం చేరుకోవటం కష్టంగా మారింది. గత ఏడాది ఖమ్మం నగర పాలక సంస్థ రూ.9 కోట్లు ఆదాయం వసూలు చేసింది. ఈ ఏడాది లక్ష్యం రూ.10 కోట్లుగా నిర్ణయించారు. కాగా ఈ సంవత్సరం ఖమ్మం నగర పాలక సంస్థలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు సంఖ్య గణనీయంగా పెరిగింది. 49మంది కొత్తగా బాధ్యతలు చేపట్టారు. గతేడాది కంటే రెవెన్యూ ట్యాక్స్ కలెక్షన్‌కు ఉద్యోగుల సంఖ్య పెరిగింది. కానీ ఆ మేరకు ఎర్లీబర్డ్ పథకం ద్వారా ముందస్తు ట్యాక్స్ కలెక్షన్‌లు పెరగాల్సింది పోయి కనీసం గతేడాది వచ్చిన ఆదాయమైనా వస్తుందా రాదాఅనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్యం రూ.10 కోట్లు..

2023-2024 సంవత్సరానికి ఎర్లీబర్డ్ పథకం ద్వారా ఖమ్మం నగర పాలక సంస్థ రూ.9 కోట్లు ఆదాయం వసూలు చేసింది. అయితే గతేడాది కంటే ఈ సంవత్సరం ఎర్లీబర్డ్‌కు నివాసాలు సంఖ్య పెరిగింది. ఖమ్మం నగరంలో ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులకు 5శాతం రాయితీ పొందేందుకు 51,770 నివాసాలు అర్హత పొందాయి. ఈ మేరకు 2025-2026 సంవత్సరానికి గాను కనీసంగా రూ.10 కోట్లు ముందస్తు ఆదాయ వసూలు(ఎర్లీబర్డ్) లక్ష్యం పెట్టుకున్నారు. ఈనెల 30తో గడువు సైతం ముగుస్తోంది. కానీ ఇప్పటి వరకు ఖమ్మం నగర పాలక సంస్థ రెవెన్యూ ఉద్యోగులు ఎర్లీబర్డ్ పథకం ద్వారా వసూలు చేసింది మాత్రం రూ.7.61 కోట్లు మాత్రమే. గతేడాది రూ.9కోట్ల లక్ష్యానికి సమీపంలో కూడా లేరు. ఇక ఈ సంవత్సరం టార్గెట్ రూ.10 కోట్లు రావాలంటే ఏదైనా అద్భుతం జరగాల్సి ఉంటుంది.

ఆదాయ వసూళ్లపై అనాసక్తి

ఖమ్మం నగర పాలక సంస్థ ఆదాయ వసూళ్లలో కనీసం 25శాతం మేరకు ఎర్లీబర్డ్ పథకం ద్వారా ముందస్తు వసూళ్లు జరిగితే తర్వాత మిగిలిన 75శాతం ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ సజావుగా జరుగుతుంది. కానీ ఈ సంవత్సరం ఎర్లీబర్డ్ ఆదాయ వసూళ్లపై రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపటం లేదు. సరైన వసూళ్ల కార్యాచరణ చేపట్టలేదని తెలుస్తోంది. కేఎంసీలోని 25మంది బిల్‌కలెక్టర్లు, ఐదుగురు ఆర్‌ఐలు, మరో ఏడుగురు ఇతర ఉద్యోగులు ఉన్నారు. అంతేకాక వారికి అసిస్టెంట్‌లను సైతం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కేటాయించారు. రూ.10కోట్ల ఆదాయ వసూళ్ల లక్ష్యం పెట్టారు. తుదిగడువు సమీపించిన రోజుల్లోనే రెవెన్యూలోని ఓ ముఖ్యమైన అధికారి అనారోగ్య సెలవ్ పెట్టి మాజీ కమిషనర్ కూతురు వివాహానికి హాజరయ్యారని కేఎంసీలో చర్చ జరిగింది. బుధవారంతో గడువు ముగిసే వరకు ఏమేరకు ఎర్లీబర్డ్ లక్ష్యం పూర్తి చేస్తారో వేచి చూడాలి..

లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం

శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి

గతేడాది రూ.9కోట్లుఎర్లీబర్డ్ ద్వారా వసూళ్లు చేశాం.ఈసంవత్సరం రూ.10 కోట్లు టార్గెట్ పెట్టాం. ఇప్పటి వరకు రూ.7.6కోట్లు వసూళ్లు జరిగాయి. గతంలో ముందస్తు ట్యాక్స్ చెల్లింపుదారుల జాబితాలను తీసుకొని ఎర్లీబర్డ్ వసూళ్లు చేస్తున్నాం. రూ.10 కోట్లు రావాలని కృషి చేస్తున్నాం..

ఏఎంసీ చైర్మన్‌కు మంత్రి తుమ్మల పరామర్శ



యర్రగర్ల హనుమంతరావును పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు తండ్రి పిచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో వీ వెంకటాయపాలెంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం వీ వెంకటాయపాలెం వెళ్లి ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.మాజీ సర్పంచి కాపా ఆదినారాయణ, కాంగ్రెస్ గ్రామశాఖ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన బీజేపీ నేతలు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పరిశీలించారు. పనులపై రైల్వేస్టేషన్ అధికారులతో సమావేశమయ్యారు. రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు వేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే 50శాతం వరకు పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.25.41 కోట్లతో వేచి ఉండేందుకు ఏసీ గదులు, మెరుగైన శౌచాలయాలు,ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టుల వంటి సదుపాయాలు ప్రయాణీకుల వినియోగానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ,వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఖమ్మం అసెబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, దోనపర్తి రవీందర్, రవిరాథోడ్, రేఖా సత్యనారాయణ, బెనర్జి, అంకతిపాపారావు, మంద సరస్వతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న నాయకులు

చెల్లని చెక్కుల కేసుల్లో ఇద్దరికి జైలు

ఖమ్మంలీగల్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని విజయనగర్ కాలనీకి చెందిన మంకెన రమేష్‌కి చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి మూడు లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మంలోని వరదయ్య నగర్ ప్రాంతానికి చెందిన మఠమ్ శంకర్‌రావు వద్ద నిందితుడు 2017లో కుటుంబ అవసరాల నిమిత్తం మూడు లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. 2019లో మూడులక్షలకు చెక్కుజారీ చేశాడు. బ్యాంకుఖాతాలో జమచేయగా,సరిపడ నగదు లేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది న్యాయవాది ఆర్.నారాయణ స్వామి ద్వారా ప్రైవేటు కేసుదాఖలు చేశారు.

ఏడాది జైలు శిక్ష

ఖమ్మం నగరం గోపాలపురం ప్రాంతానికి చెందిన కొల్లు శ్రీరజనికి చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష, రూ.4లక్షల 30వేలు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మం రోటరీనగర్ ప్రాంతానికి చెందిన డి.రాజకుమారి వద్ద నిందితురాలు 2018లో 4 లక్షలు అప్పుగా తీసుకున్నారు. నిందితురాలు పార్ట్ పేమెంట్ కింద 2019లో 4 లక్షల 30వేల రూపాయలకు చెక్కు జారీ చేశారు. ఆ చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా, నిందితురాలి సంతకం సరిగా లేదని, ఫిర్యాదికి బ్యాంకు వారు మెమోతో పాటు చెక్కును తిరిగిచ్చినారు. ఫిర్యాది తన న్యాయవాది నూనావత్ రవీందర్ ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసినారు.

100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నేలకొండపల్లి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ ప్రారంభించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్సీ కాలనీలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగదారులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏడీఈ చెప్పారు. కార్యక్రమంలో వెన్నపూసల సీతరాములు, ఏఈఈ ఆపరేషన్స్ రామారావు, ఎస్ఎల్ఐ రమేష్, ఎల్ఐ సత్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

శ్రీచైతన్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఓపెన్ క్యాటగిరిలో మూడేళ్లుగా ఆల్ ఇండియా మొదటి ర్యాంకులు సాధించినందుకు హైదరాబాద్ శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం నగరంలో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి, అన్నం ఫౌండేషన్‌లలో పండ్లు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు నాగేంద్ర, రవికుమార్‌లతోపాటు నగరానికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెత్త డబ్బాల తొలగింపుపై అధికారుల ఆగ్రహం

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో తడిపొడి, హానికర చెత్తను సేకరించేందుకు ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలను తొలగించటంపై కేఎంసీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం 2వ డివిజన్ పాండురంగాపురంలో ఈ సంఘటన చోటు చేసుకోవటంతో విషయం తెలుసుకున్న కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా సంఘటన ప్రాంతానికి వెళ్లారు. పాన్ దుకాణం వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డబ్బాలను తొలగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రూ.లక్షల వ్యయం చేసి కేఎంసీ అధికారులు ప్రధాన కమర్షియల్ ప్రాంతాల్లో మూడు రంగుల డబ్బాలను నిర్మాణం చేయటం తెలిసిందే. ఏర్పాటు చేసిన మూడు రోజులకే అవి కనుమరుగవుతున్నాయి. డబ్బాలకు సమీపంలో ఉన్న దుకాణదారులు వాటిని ఇష్టారీతిగా తొలగిస్తున్నారు. దుకాణాలకు అడ్డంగా ఉన్నాయని కొంతమంది, డబ్బాల్లో వేసిన వ్యర్థాలతో దుర్వాసన వస్తుందని మరి కొంత మంది వ్యాపారులు నీలం, ఎరుపు, బ్లూ డబ్బాలను తొలగిస్తున్నారు.



తొలగించిన డబ్బాలను తిరిగి ఏర్పాటు చేయించిన షఫీ ఉల్లా

మెరుగైన వైద్య సేవలందించాలి

తిరుమలాయపాలెం,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ప్రకృతి వైద్యశాల రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రమీలాదేవి పేర్కొన్నారు. సోమవారం తిరుమలాయపాలెంలోని ఆయుష్ ఆసుపత్రిని సందర్శించారు. ప్రకృతివైద్యశాలలోని రిజిస్టర్లను పరిశీలించారు. ఓపీ వివరాలు తెలుసుకున్నారు. ప్రకృతి వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా వైద్యసేవలందించాలన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.కనకలక్ష్మి, ఫార్మసిస్టు నరేష్, వెంకటరాజు, బాబునాయక్ పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ప్రమీలాదేవి

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీవీపాలెంలో 35 సంవత్సరాల గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. పోలీసులు ఆ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆ మృతదేహం కోసం ఎవరు రాకపోవటంతో అనాథ మృతదేహంగా భావించి ఈ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు అప్పగించారు. సోమవారం ఆ మృతదేహాన్ని పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది సమక్షంలో నగరంలోని బల్లేపల్లి వైకుంఠ ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

బోనకల్,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 467మార్కులు సాధించింది. తల్లిదండ్రులు లేకపోయినా పట్టుదలతో చదివిన ఆమెకు సోమవారం శ్రీనగర్ కాలనీ రిటైర్డ్ ఉద్యోగ సంక్షేమ సేవ సంఘం ఆధ్వర్యంలో రూ.25వేల నగదును వితరణగా అందజేశారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాలలో సోమవారం జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని డాక్టర్ కె. మహేంద్రకుమార్ ప్రారంభించారు. వారం రోజులు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిత్యం ఉదయం 8గంటల నుంచి 11:30గంటల వరకు ఉంటుందని తెలిపారు. గాజుపెంకులపై నడవటం, అరచేతిలో హారతి కర్పూరం వెలిగించి మింగటం, నాలుకపై త్రిశూలం గుచ్చుకోవటం, అరచేతిలో రంధ్రం మొదలగు అంశాలపై మొదటిరోజు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముందుగా దేశమును ప్రేమించుమన్నా గేయాన్ని కవి రౌతు రవి, మిరాకిల్ ఎక్స్‌పోజర్‌ను పురుషోత్తమరావు, నాగేంద్ర, అప్పారావు, మోహన్‌లు, తెలుగు పద్యాలను సునంద, గణితంలో గమ్మత్తులను నరసింహారావు, శివన్నారాయణ విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు అలవాల, నాగేశ్వరరావు, ఎల్వీరెడ్డి, టి.శివన్నారాయణ, డి.అరుణశ్రీ, వి. మోహన్, కె.రామారావు పాల్గొన్నారు.



గాజుపెంకులపై నడుస్తున్న విద్యార్థులు



ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెనుబల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం మండలంలోని రామచంద్రరావుబంజర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీక్లీనర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, సీరియల్ నెంబర్ల ప్రకారం రైతుల వద్దనుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని లారీలకు లోడ్ చేసే ప్రక్రియ, రిజిస్టర్ నమోదు, ధాన్యం తేమశాతాన్ని, గన్నీసంచుల వివరాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో బోర్డులు ఏర్పాటు చేసి ఇప్పటివరకు టార్పాలిన్ పట్టాలు, గన్నీ సంచులు ఎన్ని ఉన్నాయో స్పష్టమైన వివరాలను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. తాలు లేకుండా తేమ సరిగా వచ్చిన ధాన్యాన్ని తీసుకువస్తే కిలో కూడా తరుగు లేకుండా పూర్తిధర అందిస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత మొత్తాన్ని మిల్లులకు పంపించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో నిల్వల పరిస్థితిని ప్రతిరోజూ సమీక్షిస్తూ సమయానుసారంగా మిల్లులకు తరలించేవిధంగా చూడాలన్నారు. రవాణా సమస్య రాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీవో ఉపేంద్రయ్య, ఏడీఏ నరేష్, ఐకేపీ ఏపీఎం జ్యోతిప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

మెరుగైన నష్టపరిహారం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల భూనిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన పరిహారాన్ని అందిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం ఖమ్మం ఆర్డీవో కార్యాలయంలో నేషనల్ హైవే ప్రాజెక్ట్ భూసేకరణ నిర్వాసితులతో కలెక్టర్ సమీక్షించారు. చింతకాని మండలంలోని కోదుమూరు, వందనం గ్రామాల్లో భూసేకరణ చేసే భూ యజమానులు, రైతులతో కలెక్టర్ నష్టపరిహారంపై చర్చించారు. రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు ఏకరువుపెట్టారు.

రాజీవ్ యువ వికాసానికి 2,629 దరఖాస్తులు

ఏన్కూరు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలో రాజీవ్ యువ వికాస పథకానికి 2,629 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో సకినాల రమేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ 546, ట్రైబల్ వెల్ఫేర్ 1060, బీసీ కార్పొరేషన్ 821, ఈబీసీ 58, మైనారిటీ కార్పొరేషన్‌కు 101, ఎంబీసీకు 40, క్రిస్టియన్ మైనారిటీకి 3 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మండలానికి 450 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. పైలెట్‌ప్రాజెక్టు కింద ఎంపికైన రేపల్లెవాడ గ్రామంలో 94 ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు.

నగదు వితరణ

బోనకల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 467మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనపర్చింది. తల్లిదండ్రులు లేకపోయినా పట్టుదలతో చదివిన ఆమెకు సోమవారం శ్రీనగర్ కాలనీ రిటైర్డ్ ఉద్యోగ సంక్షేమ సేవసంఘ ఆధ్వర్యంలో రూ. 25వేల వితరణగా అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులకు తమవంతుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుపతికి పాదయాత్ర


ముదిగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఎన్నికైన సందర్భంగా ఖమ్మం నుంచి తిరుపతికి మొక్కు చెల్లించేందుకు పాదయాత్రగా వెళ్తున్న కోవెలమూడి జగదీష్‌కు సోమవారం ముదిగొండలో టీడీపీ నాయకులు, అభిమానులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కనపర్తి వీరబాబు, నాయకులు మాదాల శ్రీనివాస్, రామారావు, వీరబాబు, వెంకన్న, లక్ష్మి, రాకేష్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు అర్ధరహితం'

తల్లాడ, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ సభకు ప్రజలు వెళ్లకుండా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు ఆటంకాలు సృష్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్ అన్నారు సోమవారం తల్లాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరిచిపోయారన్నారు.

ప్రమాదకరంగా చెరువులు

» అంచు వెంట తవ్వకాలతో ప్రమాదాలు » అధికారులు పట్టించుకోవాలని గ్రామస్థుల వేడుకోలు



రక్షణ లేకుండా ఉన్న అళ్లపాడు చెరువు

బోనకల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆదమరిచి చెరువులోకి దిగారా సరే ఇక అంతే సంగతులు, ప్రాణాలు గాలిలో కలిసి పోవాలిసిందేనని మండలంలోని ఆళ్లపాడు గ్రామ ప్రజలు. ఎప్పుడు ఏదో ఒక రూపంలో తమ గ్రామ ప్రజలను ఊర చెరువు మృత్యువు రూపంలో వెంటాడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కుమారుడు చెరువులో పడి మృతిచెందడంతో ఒక్కసారిగా బంధువులు, ప్రజల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఏడాదికి ఒకసారి చెరువు ప్రమాదం వలన ఎవరి ప్రాణాలు పోతాయో తెలియడం లేదని వాపోతున్నారు. దీనిపై అధికారులు కూడా దృష్టి సారించడం లేదని గ్రామవాసులు మండి పడుతున్నారు. రోడ్డు పక్కనే చెరువు ఉండటంతో నిత్యం ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న చెరువుకు రక్షణ గోడ కట్టడాన్ని అధికారులు మరిచారు. వేసవి కాలంలో మట్టి తోలకాలు ఇష్టారాజ్యంగా చేపట్టడంతో చెరువు అంచున కూడా 20 అడుగుల లోతు పెట్టి కొందరు ఎక్స్‌కవేటర్లతో గుంతలు తీశారు. వర్షకాలంతో పాటు సాగర్ జలాలు విడుదల వలన నీటితో చెరువు నిండింది. రోడ్డు అంచు వరకు నీరు రావడంతో గేదేల కోసమని వెళ్లిన కొందరు గుంతల్లో ఉన్న నీటిలో మునిగి ప్రాణాలు వదులుతున్నారు. గతంలో చెరువులోకి దిగిన మరీదు కృష్ణ, తిరపయ్య, నాగరత్నం నీట మునిగి మృతి చెందారు. తాజాగా ఒకే కుటుంబంలోని తండ్రి, కుమారుడు యుసుఫ్‌ఖాన్, కరీముల్లాలు చెరువులో దిగి నీట మునిగి మృత్యువాతన పడారు. వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు కూడా సరదాగా చెరువు వైపునకు వస్తే వారి ప్రాణాలకు ప్రమాదం లేకపోలేదని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెరువుకు రక్షణ గోడ తక్షణమే నిర్మించేలా చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ ఉండేలా చూడాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు మంత్రులు బాధ్యత తీసుకోవాలి

» తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు



రాస్తారోకో చేస్తున్న బాగం హేమంతరావు, బొంతు రాంబాబు, రైతులు

వైరా, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతం, ఇతర కారణాల సాకుతో షరతులు పెట్టి ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రెండు రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రైతులు రోడ్డెక్కారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఎదురుగా ఉన్న వైరా-మధిర, జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దాంతో రోడ్డుకు రెండువైపులా దాదాపు గంటసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం రైతులకు అండగా ఈ రాస్తారోకోలో పాల్గొన్నారు. రాస్తారోకో సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ కేవీశ్రీనివాసరావు, ఏవో మయాన్ మంజూఖాన్ రైతుల ఆందోళన వద్దకు చేరుకున్నారు. ఖమ్మంజిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జరుగుతున్నాయని బాగం, బొంతు విమర్శించారు. వైరా మార్కెట్ యార్డులో గత 20రోజుల నుంచి ధాన్యం రాశులు పోసి కొనుగోళ్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, క్వింటా ఒక్కింటికి ఐదుకిలోల తరుగు కింద మిల్లర్లకు ఇవ్వాలని అలా అంగీకరించిన రైతుల ధాన్యం మాత్రమే కాంటాలు వేస్తామని చెబుతూ అందుకు అంగీకరించిన వారి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయటాన్ని తీవ్రంగా నిరసించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకొని ధాన్యం రైతులు నష్టపోకుండా చూడాలని వారు కోరారు.

అధికారుల హామీతో రాస్తారోకో విరమణ

రాస్తారోకో వద్దకు చేరుకున్న తహసీల్దార్, ఏవో, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ రైతు సంఘాల నాయకులు, రైతులతో చర్చలు జరిపారు. రైతుల డిమాండ్‌ను అధికారులకు ఫోన్ ద్వారా వివరించారు. ధాన్యం రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని, తరుగు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేస్తామని జిల్లా అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు, రైతుసంఘం పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తోట రామాంజనేయులు, పోటు కళావతి, బండి సురేష్, హరి వెంకటేశ్వరరావు, సామినేని రవి, మాడపాటి మల్లికార్జున్, హరి శ్రీనివాసరావు, హరికృష్ణ, వడ్లమూడి మధు, గోరింట్ల శ్రీధర్ పాల్గొన్నారు.



తహసీల్దార్, ఏవోతో మాట్లాడుతున్న నేతలు

రాయన్నపేట మాజీ సర్పంచ్ సుశీల మృతి

» నివాళులర్పించిన సీపీఐ, సీపీఎం రాష్ట్ర నాయకులు



సుశీల మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బోనకల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయన్నపేట గ్రామానికి చెందిన అమరజీవి కామ్రేడ్ తూము ప్రకాశరావు సతీమణి, మాజీ సర్పంచ్ తూము సుశీల(85) సోమవారం మృతి చెందారు. బడుగు బలహీనవర్గాల పక్షాన నిస్వార్థంగా పోరాడి పేద ప్రజలకు భూములను పంచిన దివంగత సీపీఐ నాయకుడు ప్రకాశరావు ఆశయాల్లో ఆమె ఎంతగానో తోడ్పాటునందించారు. బత్తినేని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నాగప్రసాదరావు సుశీలకు అల్లుడు. ఆమెకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. భౌతిక కాయాన్ని నాయకులు బాగం హేమంతరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, బండి సురేష్, సింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఎర్రా బాబు, బెజవాడ రవిబాబు, మందడపు రాణి, తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, పోటు కళావతి, పోతినేని సుదర్శన్‌రావు, వాసిరెడ్డి రామనాథం, పైడిపల్లి కిషోర్‌కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు లు సందర్శించి నివాళులర్పించారు.

కబడ్డీ విజేత గంగుల నాచారం జట్టు



బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు

ఏన్కూరు, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుల నాచారం గ్రామంలో ఈనెల 25నుంచి 27వరకు జరిగిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి కబడ్డీ పోటీల్లో గంగులనాచారం జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. రెండో బహుమతి సూరారం, మూడో బహుమతి గోలిమిల్లు, నాలుగో బహుమతి గంగులనాచారం, ఐదవ బహుమతి చెరువుమాధారం జట్లు విజేతగా నిలిచాయి. గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు షీల్డ్‌లను అందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మల్లేష్, మల్కం గంగులు, పూనెం సుధీర్, మల్కం బద్రయ్య, బీమరాజు, గోపాలరావు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఉచిత కరాటే శిక్షణ

సత్తుపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు కరా టే మాస్టర్ వి.పిచ్చయ్య సోమవారం తెలిపారు. మే ఒకటవ తేదీ నుంచిఈ శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. మే 25 వరకూ స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో, ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రేపు తల్లాడలో భూ భారతిపై సదస్సు

తల్లాడ, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): తల్లాడలోని ఆరెటీ గార్డెన్‌లో ఈనెల 30న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు జరుగుతుందని తల్లాడ తహసీల్దార్ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్ హాజరవుతారని తెలిపారు. రైతులు, పలు పార్టీల నాయకులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బోనకల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రియాశీలక సభ్యత్వాల్లో నియోజకవర్గంలో బోనకల్ మండలం ముందంజలో నిలిచిందని టీడీపీ మండల అధ్యక్షుడు రావూట్ల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని రావినూతల గ్రామంలో సోమవారం సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనకల్ మండలంలో రావినూతల 200సభ్యత్వాలు ఉంటే ప్రథమ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైనేని రవికుమార్, శ్రీనివాసరావు, వీరభద్రం, చంద్రయ్య, సావిత్రి, వీరన్న, శ్రీనివాసరావు, నాగమణి, సైదులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్రజావాణి

» గైర్హాజరవుతున్న అధికారులు

కొణిజర్ల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలంలో సోమవారం చేపట్టిన ప్రజావాణికి పలుశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఆయా శాఖలకు సంబంధించి సమస్యలే లేనట్లుగా ఆయా శాఖల అధికారులు హాజరుకాలేదు. వచ్చిన అధికారులు కూడా ఇష్టానుసారంగా వస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వచ్చిన వారు మధ్యలో వెళ్లిపోతున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎవ్వరికి దరఖాస్తు ఇవ్వాలో తెలియక గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రామును అడగగా సుమారు పదిశాఖల అధికారులు హాజరయ్యారని, దాని వారి నివేదకను కలెక్టరేట్‌కు పంపుతామన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి

ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో బీజేపీ విఫలం

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

చింతకాని, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాదుల దాడులను సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో మధిర డివిజన్ విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉగ్రవాద, టెర్రరిస్ట్ దాడులను సీపీఎం నిత్యం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఆ చర్యలకు సీపీఎం పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదం దేశానికి ప్రమాదకరంగా మారిందన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసుల ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి చట్ట పద్ధతి కల్పించాలన్నారు. వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడానికి రైతులను రక్షించుకునేందుకు రైతు పోరుబాట తప్ప మరో మార్గం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మడిపల్లి గోపాలరావు, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, రాచబంటి రాము, కిలారు సురేష్, మంద సైదులు, పడకంటి మురళి, పాపినేని రామ నర్సయ్య, పయ్యావుల ప్రభావతి, బట్టు పురుషోత్తం పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ



గాజుపెంకులపై నడుస్తున్న విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలీ, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాలలో సోమవారం జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని డాక్టర్ కె. మహేంద్రకుమార్ ప్రారంభించారు. వారం రోజులు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిత్యం ఉదయం 8గంటల నుంచి 11:30గంటల వరకు ఉంటుందని తెలిపారు. గాజుపెంకులపై నడవటం, అరచేతిలో హారతి కర్పూరం వెలిగించి మింగటం, నాలుకపై త్రిశూలం గుచ్చుకోవటం, అరచేతిలో రంధ్రం మొదలకు అంశాలపై మొదటి రోజు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముందుగా దేశమును ప్రేమించుమన్నా గేయాన్ని కవి రౌతు రవి, మిరాకిల్ ఎక్స్‌పోజర్‌ను పురుషోత్తమరావు,నాగేంద్ర, అప్పారావు, మోహన్‌లు, తెలుగు పద్యాలను సునంద, గణితంలో గమ్మత్తులను నరసింహారావు, శివన్నారాయణ విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు అలవాల. నాగేశ్వరరావు, ఎల్వీ రెడ్డి, టి.శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని వినతి

కల్లూరు, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా వీవోఏల సంఘం(ఏఐటీయూసీ అనుబంధం) నాయకులు డిమాండు చేశారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి, ఏఐ టీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదే లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, నాయకురాలు సీహెచ్ సీతామహాలక్ష్మిలు గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలకు నాణ్యమైన ట్యాబ్‌లు అందించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వేతనాలు వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని కోరారు. టీఏ, డీఏలను ప్రభుత్వమే ఇవ్వాలని, ప్రతి నెల 5న వేతనాలు అందించాలని, ఐకేపీ సిబ్బంది వేధింపులు ఆపాలని ఇంకాను తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం నాయకులు ఫాతీమా, షాహానాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వీవోఏల సంఘం నాయకులు

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



ఇందిరమ్మ పచ్చతోరణం పథకంలో పెరిగిన చెట్లు

వైరా, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు అభివృద్ధి కోసం పచ్చని చెట్లను అడ్డగోలుగా నరికివేస్తున్నారు. ఉమ్మడి ఏపీలో ఇందిరమ్మ పచ్చతోరణం పథకం కింద 15ఏళ్ల కిందట వేసిన చెట్లు ఇప్పుడు గొడ్డలి వేటుకు అంతరించిపోయాయి. సిరిపురం-స్నానాల లక్ష్మీపురం-గండగలపాడు గ్రామాల మధ్య పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు గురయ్యాయి. సిరిపురం నుంచి స్నానాల లక్ష్మీపురం మీదుగా గండగలపాడు నుంచి జాతీయ ప్రధాన రహదారి వరకు రెండువరుసల రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఇప్పుడు స్నానాల లక్ష్మీపురం-గండగలపాడు గ్రామాల మధ్య ఇందిరమ్మ పచ్చతోరణంలో రోడ్డుకు రెండువైపులా ఏపుగా పెరిగి నీడనిస్తున్న చెట్లను అడ్డగోలుగా నరికివేశారు. ఓవైపున ఉన్నత న్యాయస్థానాలు చెట్లను రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ఆదేశిస్తున్నప్పటికీ ఇక్కడ అవి ఏమాత్రం అమలుకావడం లేదు. వాల్టా చట్టం ప్రకారం చిన్న చెట్టును నరకడానికి కూడా అటవీశాఖ అనుమతి కావాలి. అయితే ఇక్కడ ఏ అనుమతులు లేకుండానే ఆర్‌అండ్‌బీ అధికారుల కనుసన్నల్లో రోడ్డు అభివృద్ధి పేరిట చెట్లను బలికించివేస్తున్నారు. చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొక్కల పెంపకం, సంరక్షణ కోసం లక్షలాదిరూపాయలు ప్రభుత్వం ఖర్చుచేసింది. తిరిగి అదే ప్రభుత్వానికి చెందిన యంత్రాంగం రోడ్డు అభివృద్ధి పేరిట అడ్డగోలుగా నరికివేసిన తీరు తీవ్ర విమర్శలకు గురవుతుంది. న్యాయస్థానాలు పట్టణాల్లోని చెట్ల నరికివేతపైనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో అడ్డగోలుగా చెట్లను నరికివేస్తున్న ఆయా శాఖల అధికారుల వ్యవహారశైలిపైన కూడా కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ కోసం నరికివేసిన చెట్లు